అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట

- చిన్నారులను చేర్చేందుకు కార్యాచరణ
- ప్రారంభమైన ప్రత్యేక కార్యక్రమాలు


సుద్దపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఎగ్ బిర్యానీ తింటున్న చిన్నారులు

పెగడపల్లి: అంగన్‌వాడీ కేంద్రాలు అనగానే అరకొర సౌకర్యాలు, అద్దె భవనాలే గుర్తుకొస్తాయి. అయితే ఇందుకు భిన్నంగా ప్రస్తుతం ప్రభుత్వం చిన్నారుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించింది. అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యను కూడా అమలు చేస్తున్నారు. ప్రవేశాలు పెంచేందుకు అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట పేరుతో ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా మంగళవారం నుంచి ఈనెల 17 వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక విద్యలో చేరడానికి పెద్ద మొత్తంగా ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాల్లో గతంలో ఆట పరికరాలు, చిత్రాల ద్వారా కొనసాగుతున్న బోధన పద్ధతులను దృశ్య శ్రవణ మాధ్యమాల్లోకి మారుస్తున్నారు. చిన్నారులకు నాణ్యమైన పూర్వ ప్రాథమిక విద్యను అందించడంతోపాటు వారు నేర్చుకున్న అంశాలపై పట్టు సాధించి బడికి వెళ్లేలా సిద్ధం చేసేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా మెట్‌పల్లి, జగిత్యాల, ధర్మపురి మల్యాల ప్రాజెక్టులుండగా.. వీటి పరిధిలో 1,065 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. అమ్మ మాట.. అంగన్‌వాడీ బాటలో భాగంగా రోజువారీ కార్యక్రమాల్లో ఉదయం అంగన్‌వాడీ కేంద్రాల అలంకరణ, తల్లిదండ్రులతో సెల్ఫీలు దిగడం, తల్లులు, మహిళా సంఘాలతో సమావేశాలు ఏర్పాటు చేయడం వంటివి చేయాల్సి ఉంటుంది. ఈనెల 12 నుంచి 17 వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. 12న గ్రామంలో అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు, ఎన్జీవో సంఘాలు, తల్లిదండ్రులు, పోషణ అభియాన్ సిబ్బందితో కలిసి ర్యాలీలు చేపట్టాలి. 13న గ్రామాల్లో రెండేళ్ల లోపు పిల్లలను గుర్తించాలి. వారిని అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించేలా వారి తల్లిదండ్రులకు వివరించాలి. కేంద్రాల్లో అందుతున్న సౌకర్యాలను వివరించి ఆ సేవలు పొందేలా వారిని ప్రోత్సహించాలి. కేంద్రంలో చదువు పూర్తయిన విద్యార్థులకు ధ్రువపత్రాలు అందించాలి. 14న స్వచ్ఛ అంగన్‌వాడీ పేరుతో కేంద్రాల్లో చెత్త, ఇతర వ్యర్థాలను తొలగించి శుభ్రం చేయాలి. కేంద్రాల పరిసరాల్లో మొక్కలు నాటాలి. తాగునీరు, టాయిలెట్లు ఉపయోగంలోకి తీసుకొచ్చేలా చూడాలి. 15న కేంద్రాల్లో విద్యార్థులను ఆకట్టుకునేలా తగిన వాతావరణం కల్పించాలి. 16, 17ల్లో సాముహిక అక్షరభ్యాసాలు నిర్వహించాలి. పిల్లలకు పాఠాలు, టైంటేబుల్, సాంస్కృతిక కార్యక్రమాలు తదితర అంశాలపై అవగాహన కల్పించాలి. స్టడీ మెటీరియల్ పంపిణీ చేయాలి.

అందరూ సహకరించాలి



అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రైవేటుకు దీటుగా పూర్వ ప్రాథమిక విద్యాబోధన చేస్తున్నారు. చిన్నారులకు కావాల్సిన అనేక పోషకాలతో కూడిన పౌష్టికాహారం అందిస్తున్నాం. ఈనెల 17 వరకు కొనసాగనున్న అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట కార్యక్రమానికి అందరూ సహకరించాలి. కేంద్రాల్లో నిర్వహించే కార్యక్రమాలపై చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తాం. – నరేశ్, డీడబ్ల్యూవో

ప్రాజెక్టు	గర్భిణులు	బాలింతలు	6 నెలల లోపు చిన్నారులు	7 నెలల నుంచి 3 ఏళ్ల చిన్నారులు	3 ఏళ్ల నుంచి 6 ఏళ్ల చిన్నారులు
ధర్మపురి	1,027	851	784	4,958	4,220
జగిత్యాల	2,038	1,775	1,607	9,900	9,967
మల్యాల	1,009	1,041	994	5,595	4,547
మెట్‌పల్లి	2,495	2,305	1,998	12,557	11,499

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జగిత్యాలరూరల్: జాబితాపూర్ 11 కేవీ ఫీడర్ మరమ్మతు దృష్ట్యా గురువారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు పొలాస ఏఈ సుందర్ తెలిపారు. జాబితాపూర్, ధర్మారం గ్రామాల్లో ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు

దరఖాస్తులు ఆహ్వానం

మల్యాల: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో కంప్యూటర్ సైన్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులు బోధించేందుకు అతిథి అధ్యాపకుల ప్రాతిపదికన దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కస్తూర్బా పాఠశాల స్పెషల్ ఆఫీసర్ స్రవంతి తెలిపారు. మల్యాల కేజీబీవీలో ఈ ఏడాది నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం కంప్యూటర్ సైన్స్ తరగతులు ప్రారంభించామని పేర్కొన్నారు. కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టు బోధించేందుకు బీటెక్ లేదా సీఎస్ఈ(ఐటీ) లేదా ఎంసీఏ లేదా ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్ చదివినవారు అర్హులని, ఇంగ్లిష్ సబ్జెక్టు బోధించేందుకు ఎంఏ ఇంగ్లిష్‌తోపాటు బీఈడీ ఉత్తీర్ణులు అయినవారు అర్హులన్నారు. అనుభవం, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 14 సాయంత్రం 5 గంటల్లోగా మండల కేంద్రంలోని కేజీబీవీలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఎస్పీని కలిసిన రూరల్ సీఐ


ఎస్పీకి పూల మొక్క అందిస్తున్న సుధాకర్

జగిత్యాలక్రైం: రూరల్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన సుధాకర్ బుధవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ అశోక్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పూల మొక్కను అందజేశారు.

బాధ్యతలు స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న సీఐ కరుణాకర్

జగిత్యాలక్రైం: పట్టణ సీఐగా కరుణాకర్ బుధవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన వేణుగోపాల్ ఇటీవల ఐజీ కార్యాలయానికి బదిలీ అయ్యారు.

విశ్వకర్మ యోజన కిట్లు అందజేత


రాయికల్‌లో కిట్లు అందిస్తున్న మల్లారెడ్డి

రాయికల్: ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకం కింద ఎంపికైన పట్టణంలోని లబ్ధిదారులకు బుధవారం బీజేపీ పట్టణ అధ్యక్షుడు కుర్మ మల్లారెడ్డి ఆధ్వర్యంలో టూల్ కిట్లను అందజేశారు. నాయకులు బన్న సంజీవ్, కడార్ల శ్రీనివాస్, మల్లేశ్‌యాదవ్, పటేల్ రామ్, తోకల శంకర్, బూత్ అధ్యక్షుడు అందే శంకర్, పోస్టు మాస్టర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ నిర్మాణమే లక్ష్యం


పెంబట్లలో కార్యకర్తల సమావేశంలో నాయకులు

సారంగాపూర్: వికసిత్ భారత్ నిర్మాణమే బీజేపీ లక్ష్యంగా ప్రధాన మంత్రి మోదీ కృషి చేస్తున్నారని నాయకులు అన్నారు. పెంబట్ల గ్రామంలో మండల అధ్యక్షుడు రెంటం జగదీశ్ అధ్యక్షతన స్థానిక సంస్థల ఎన్నికలపై బుధవారం జరిగిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. కంచర్ల శివ, బాస నాగేందర్, భీమన్న, రాజేశ్వర్‌రెడ్డి, శేఖర్, వంశీ, సతీశ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలి


వినతిపత్రం అందిస్తున్న నాయకులు

రాయికల్: పట్టణంలోని అంబేడ్కర్ సంఘ భవనానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ బుధవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను మాల సంక్షేమ సంఘం సభ్యులు కలిసి వినతిపత్రం అందజేశారు. చెంగలి గంగాధర్, పుర్రె శ్రీనివాస్, గుర్రం రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్: జగిత్యాల అర్బన్ మండలం హస్నాబాద్‌లో గౌడ సంఘం భవనాన్ని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ బుధవారం ప్రారంభించారు. గీత కార్మికుల రక్షణకు కాటమయ్య రక్షణ కిట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. చల్‌గల్ వ్యవసాయ మార్కెట్‌లో రూ.2కోట్లతో సీసీ రోడ్లు, ధాన్యం ఆరబోసేందుకు ఫ్లోర్‌ను పూర్తి చేశామని అన్నారు. ఎంపీవో విజయలక్ష్మి, డీఈ మిలింద్, ఏఈ విజయ్, మాజీ ఎంపీటీసీ మల్లారెడ్డి, గౌడ సంఘం అధ్యక్షుడు వెంకట్రాజం, నాయకులున్నారు.

రసాయనాలు తగు మోతాదులో వాడాలి


కరపత్రాలతో వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు, రైతులు

కోరుట్ల రూరల్: పంటలకు రసాయన ఎరువులు ఎక్కువగా వినియోగిస్తే ఎలాంటి ఉపయోగం ఉండదని, తగ్గిస్తే ఖర్చు ఆదా అవుతుందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం జగిత్యాల శాస్త్రవేత్తలు అన్నారు. అయిలాపూర్‌లో వ్యవసాయ శాఖ సహకారంతో బుధవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. శాస్త్రవేత్తలు రైతులకు పంటల సాగుపై సలు సూచనలు, సలహాలు చేశారు. సాగు మెలకువలకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. మండల వ్యవసాయ అధికారి నాగమణి, శాస్త్రవేత్తలు బి.శ్రీనివాస్, డీపీ రజినీదేవి, ఏఈవో శ్రీహరి, రైతులు పాల్గొన్నారు.

మేడిపల్లి: భీమారం మండల కేంద్రంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం-పొలాస వ్యవసాయ శాస్త్రవేత్తలు యూరియా వాడకం, విత్తనాల సేకరణ, నేల ఆరోగ్యం, రసాయనాలు, పంట మార్పిడి, సుస్థిర వ్యవసాయంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శాస్త్రవేత్తలు సతీశ్, ప్రజ్ఞ, వ్యవసాయాధికారి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల పరిశుభ్రతలో స్వచ్ఛ మిత్రలే కీలకం


రాయికల్‌లో అవగాహన కల్పిస్తున్న షబిల్

రాయికల్: పాఠశాల పరిశుభ్రతలో స్వచ్ఛ మిత్రల పాత్ర కీలకమని ఎంఈవో శ్రీపతి రాఘవులు అన్నారు. బుధవారం పట్టణంలో 32 గ్రామాల ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు పారిశుద్ధ్య కార్మికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చేతుల పరిశుభ్రత, ఆరోగ్యకరమైన అలవాట్లు తదితర అంశాలపై బస్తీ దవాఖాన వైద్యులు షబిల్ అవగాహన కల్పించారు. రిసోర్స్‌పర్సన్ అభయ్ రాజు, ప్రధానోపాధ్యాయుడు భోగ రమేశ్, సీఆర్పీలు రవీందర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల: పట్టణంలోని జిల్లాపరిషత్ బాలికల పాఠశాలలో బుధవారం పాఠశాల మధ్యాహ్న భోజన పారిశుద్ధ్య సహాయకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంఈవో గంగుల నరేశం మాట్లాడుతూ.. ప్రతీ పాఠశాల పరిసరాలు, బాలబాలికల మూత్రశాలలు, తరగతి గదులు శుభ్రం చేయాలని సూచించారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి


వంట గదిని పరిశీలిస్తున్న తహసీల్దార్ శేఖర్

వెల్గటూర్: ఆదర్శ పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తహసీల్దార్ శేఖర్ హాస్టల్ సిబ్బందికి సూచించారు. బుధవారం కుమ్మరిపల్లి ఆదర్శ పాఠశాల బాలికల హాస్టల్‌ను ఎంఈవో ప్రభాకర్‌తో కలిసి సందర్శించారు. గురువారం నుంచి పాఠశాలలు పునః ప్రారంభమవుతున్నందున పాఠశాలలో శానిటేషన్‌కు సంబంధించిన వసతులను పరిశీలించారు. సీఆర్పీ వెంకటేశ్వర్లు, హాస్టల్ వార్డెన్, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి విరాళం


విరాళం అందిస్తున్న దంపతులు

ధర్మపురి: ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి దంపతులు రూ.10వేల విరాళం అందజేశారు. తుమ్మెనాల గ్రామానికి చెందిన చిటనోజు సందీప్–సాగరిక వివాహ వార్షిక వేడుకల సందర్భంగా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కాశెట్టి శ్రీనివాస్‌కు అందించారు.

యాదవులందరినీ ఏకం చేస్తాం


ఎర్దండిలో సభ్యత్వం నమోదు చేయిస్తున్న నాయకులు

ఇబ్రహీంపట్నం: జిల్లావ్యాప్తంగా ఉన్న యాదవులందరినీ ఏకం చేస్తామని, యాదవులకు న్యాయంగా రావాల్సిన హక్కులను సాధించుకుంటామని యాదవ సంఘం అడహక్ కమిటీ జిల్లా అధ్యక్షుడు గణవేని మల్లేశ్‌యాదవ్ అన్నారు. బుధవారం ఎర్దండి, కేశాపూర్ గ్రామాల్లో యాదవ సంఘ సభ్యులతో సమావేశం నిర్వహించారు. సభ్యత్వాలను నమోదు చేశారు. తోట్ల చిన్నయ్యయాదవ్, శంకర్‌యాదవ్, నాగేశ్‌యాదవ్, ద్యాగవేని అనిల్, రెబ్బస్ రమేశ్, నూకల శేఖర్, రెబ్బస్ గంగాధర్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

శిశుమందిరాలను ఆదరించాలి


అదనపు గది ప్రారంభిస్తున్న సుధాకర్

కోరుట్ల: శ్రీసరస్వతి శిశుమందిర్ పాఠశాలల్లో మన సంస్కృతి, సంప్రదాయాలతోపాటు దేశ భక్తి మిళిత విద్యాబోధన ఉంటుందని శ్రీసరస్వతి విద్యాభారతి దక్షిణ మధ్య క్షేత్ర సంఘటనా కార్యదర్శి లింగం సుధాకర్ అన్నారు. పట్టణంలోని శ్రీసరస్వతి పాఠశాలలో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదులను ప్రారంభించారు. సరస్వతి శిశుమందిరాలను సమాజంలో అందరూ ఆదరించాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. డాక్టర్ వేముల ప్రభాకర్, డాక్టర్ వేముల రవికిరణ్, సరస్వతి పీఠం ప్రాంత ఘటనా కార్యదర్శి పతాకమూరి శ్రీనివాస్, కొత్త సురేశ్, వనపర్తి చంద్రమోహన్, నీలి శ్రీనివాస్, ప్రధానాచార్యులు, ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

నిధుల కొరతతో భారాన్ని మోయలేం



మల్లాపూర్: పంచాయతీల్లో నిధుల కొరతతో ట్రాక్టర్ల నిర్వహణ భారాన్ని మోయలేమని కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి అన్నారు. ఎంపీడీవో కార్యాలయం ఎదుట మండల పంచాయతీ కార్యదర్శులు జీపీ ట్రాక్టర్ల తాళాలను ఎంపీవో జగదీశ్‌కు అప్పగించారు. పంచాయతీల నిర్వహణకు కార్యదర్శులు అప్పులు చేస్తున్నారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మురళి, శ్రీనివాస్, నారాయణరెడ్డి, బాలచందర్, అశోక్, వినోద్, రంజిత్, శ్రీధర్, విజయ్ పాల్గొన్నారు.

యావర్ రోడ్డును విస్తరించాలి

జగిత్యాలటౌన్: పట్టణంలో ప్రధాన రహదారి అయిన యావర్ రోడ్డు ఇరుగ్గా ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, ఈ ప్రమాదాల్లో ఎందరో గాయాలపాలవుతుండగా.. పలువురు ప్రాణాలు కోల్పోయారని భారత్ సురక్షా సమితి నాయకులు అన్నారు. యావర్ రోడ్డు విస్తరణ చేపట్టాలని కోరుతూ బుధవారం తహసీల్ చౌరస్తాలో నిరసన తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసీఎస్ రాజు మాట్లాడుతూ.. వంద ఫీట్లకు విస్తరించాలని కోరారు.

ఆరోగ్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

జగిత్యాల: మున్సిపల్ కార్మికులు, స్వయం సహాయక సభ్యులకు శుక్రవారం నిర్వహిస్తున్న ఆరోగ్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ స్పందన సూచించారు. పాత మెప్మా భవన్‌లో శిబిరం నిర్వహిస్తున్నామని, వైద్యులు పూర్తిస్థాయి వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు.

ధర్మపురి: మున్సిపల్ కార్యాలయంలో ఈనెల 13 నిర్వహించనున్న ఆరోగ్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ సూచించారు. 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మెప్మా, జిల్లా వైద్య బృందం సహకారంతో కార్మికులు, స్వయం సహాయక సంఘాలు, స్త్రీల ఆరోగ్యంపై అవగాహన పెంచడం, ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం తదితర వాటి కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ముత్యంపేట వీడీసీ చైర్మన్‌గా రాజేశ్

మల్లాపూర్: ముత్యంపేట గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్‌గా దామ రాజేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ గ్రామ కుల సంఘాల ప్రతినిధులు బుధవారం తెలిపారు. ఉపాధ్యక్షుడిగా బూస చిన్నరాజం, కోశాధికారిగా సురకంటి రవి ఎన్నికయ్యారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ

పెగడపల్లి: ఇందిరమ్మ పథకం కింద ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు పనులు ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేసుకోవాలని ఏఎంసీ చైర్మన్ రాములుగౌడ్, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి కోరారు. రాములపల్లి, అయితిపల్లి గ్రామాల్లో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. విండో మాజీ చైర్మన్ లక్ష్మీనారాయణ, నాయకులు తిరుపతి, మహేందర్, రాజ్‌కుమార్, సత్తయ్య, స్వామి, నర్సమ్మ, రాజు, రామ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, పంచాయతీ కార్యదదర్శులు నదీం, శివప్రసాద్, మంజుల పాల్గొన్నారు.

జీవన్‌రెడ్డిని కలిసిన విప్

జగిత్యాలటౌన్: ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ బుధవారం మాజీ మంత్రి జీవన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. జీవన్‌రెడ్డితో కాసేపు ముచ్చటించిన ఆది శ్రీనివాస్ తిరిగి వేములవాడ బయల్దేరి వెళ్లారు.

గంగామాతకు బోనాలు

మల్లాపూర్: ముత్యంపేటలో బుధవారం గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో శ్రీగంగామాతకు బోనాలు సమర్పించారు. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి మహిళలు బోనాలతో తరలివచ్చారు. గ్రామ పుర వీధుల గుండా గంగపుత్రులు గొల్లెంతో చేసిన విన్యాసాలు అలరించాయి. గంగామాత ఆలయంలో గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

వేంకటేశ్వర ఆలయంలో పౌర్ణమి వేడుకలు

కోరుట్ల: పట్టణంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం మాదిరిగా బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి స్వామివారి శోభాయాత్ర పట్టణ వీధుల్లో చేపట్టారు. ఆలయ అధ్యక్షుడు యతిరాజం నర్సయ్య, అర్చకులు, ఆలయ ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

సాక్షి స్పందన



కోరుట్ల రూరల్: ఎంపీడీవో కార్యాలయ ఆవరణ శుభ్రం చేశారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో పేరుకుపోయిన చెత్తపై సాక్షి దిన పత్రికలో ప్రచురితమైన వాట్సాప్ కథనానికి ఎంపీడీవో రామకృష్ణ స్పందించారు. కార్యాలయ ఆవరణలోని టాయిలెట్ల ముందు, వెనక భాగంలో ఉన్న చెత్త, చెట్ల పొదలను తొలగించి శుభ్రం చేయించారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం


ప్రొసీడింగ్స్ అందజేస్తున్న మంత్రి లక్ష్మణ్‌కుమార్

గొల్లపల్లి: పేదింటి ప్రజల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమాన్ని ముందుకు తీసుకుపోతోందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అర్హులైన లబ్ధిదారులకు కలెక్టర్ సత్యప్రసాద్, ఆర్డీవో మధుసూదన్‌తో కలిసి పంపిణీ చేశారు. పేదలకు ప్రొసీడింగ్స్ పంపిణీ చేయడం ఆనందంగా ఉందని అన్నారు. ఏఎంసీ చైర్మన్ భీమ సంతోష్, వైస్ చైర్మన్ రాజిరెడ్డి, తహసీల్దార్ వరందన్, ఎంపీడీవో రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురి: ధర్మపురిలోని అయ్యప్పస్వామి దేవాలయంలో మంత్రి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ వ్యవస్థాపకులు భీమనాథి మంగ అశోక్ మంత్రిని సన్మానించారు. నాయకులు దినేశ్, సీపతి రాజేశ్ తదితరులున్నారు.

మంత్రిని కలిసిన కార్యదర్శుల బృందం

మల్లాపూర్: మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను బుధవారం జిల్లా పంచాయతీ కార్యదర్శుల సమాఖ్య బృందం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపింది. కార్యదర్శుల సమస్యలను వివరించగా.. ఆయన సానుకూలంగా స్పందించారు. కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, కోశాధికారి సతీశ్, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సంగెంలో మన ఊరు.. మన బడి


ఇంటింటా ప్రచారంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు

కోరుట్ల రూరల్: సంగెం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు మన ఊరు.. మన బడి కార్యక్రమం నిర్వహించారు. హైస్కూల్ రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు నల్ల శంకర్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పోతుగంటి శంకర్, ముంజ రాజం, శనిగారపు శంకర్, వీడీసీ అధ్యక్షుడు కాటిపెల్లి మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల అవగాహన ర్యాలీ

రాయికల్: అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా బుధవారం ఒడ్డెలింగాపూర్, ధర్మాజీపేట, మైతాపూర్ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్ పద్మావతి మాట్లాడుతూ.. ప్రతి అంగన్‌వాడీ సెంటర్లో కొత్త మెనూ ప్రకారం ఎగ్ బిర్యానీతోపాటు పౌష్టికాహారం అందజేస్తున్నామన్నారు. హెల్త్ సిబ్బంది హేమలత, ప్రశాంతి, కాయితి ప్రమీల, మ్యాకల అనురాధ, అంగన్‌వాడీ టీచర్లు మమత, శాంత, పద్మాలత, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లు, పిల్లలు, పిల్లల తల్లులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శోభారాణి, అంగన్‌వాడీ టీచర్లు ఇందిర, ప్రమీల, రమదేవి, మంజుల, రాజకళ, భాగ్యలక్ష్మి, రాధ పాల్గొన్నారు.

కథలాపూర్: గ్రామాల్లోని చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హైమాది బేగం సూచించారు. దుంపేటలో ర్యాలీ చేపట్టారు. కార్యదర్శి చంద్రశేఖర్, అంగన్‌వాడీ టీచర్లు సునీత, గోదావరి పాల్గొన్నారు.

మల్లాపూర్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల సంఖ్యను పెంచి బలోపేతం చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ అన్నారు. నడికుడలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు, వీవోలు, విద్యార్థులతో ర్యాలీ చేపట్టారు.

భూభారతితో సమస్యలు పరిష్కారం

రాయికల్: భూసమస్యల పరిష్కారానికి భూభారతి రెవెన్యూ సదస్సు దోహదపడుతుందని తహసీల్దార్ నాగార్జున అన్నారు. బుధవారం మైతాపూర్, ధర్మాజీపేట గ్రామాల్లో సదస్సులు నిర్వహించారు. భూసమస్యలపై రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లిరూరల్: భూసమస్యల పరిష్కారానికి భూభారతి చట్టం ఉపయోగపడుతుందని అడిషనల్ కలెక్టర్ లత అన్నారు. మెట్‌పల్లి మండలం రాజేశ్వర్‌రావుపేటలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సును సందర్శించారు. దరఖాస్తుదారులతో మాట్లాడి సమస్యల గురించి తెలుసుకున్నారు.

సారంగాపూర్: భూభారతి కార్యక్రమం ద్వారా ప్రజలకు భూముల విషయంలో సంపూర్ణ న్యాయం జరుగుతుందని సారంగాపూర్, బీర్‌పూర్ తహసీల్దార్లు వహిదొద్దీన్, సుజాత అన్నారు. బుధవారం సారంగాపూర్ మండల కేంద్రంతోపాటు బీర్‌పూర్ మండలం కమ్మునూర్, కండ్లపల్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరిగాయి.

నేడు స్కూళ్లు ప్రారంభం

జగిత్యాల: పాఠశాలలు గురువారం నుంచి పునః ప్రారంభం కానున్నాయి. నెల 15 రోజుల వేసవి సెలవులు ముగిసి పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. పారిశుధ్యం మెరుగుపర్చడంతోపాటు కొన్ని పాఠశాలలకు రంగులు సైతం వేశారు. జిల్లాలోని పలు పాఠశాలల్లో ఇప్పటికే మన ఊరు.. మన బడి పథకం కింద అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టగా.. అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద టాయిలెట్లు, ఇతర మౌలిక వసతులకు మరమ్మతు చేశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్‌స్థాయిలో చదువు అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోంది. జిల్లాలోని ఉపాధ్యాయులకు సబ్జెక్టులపై శిక్షణ కల్పించారు. ప్రస్తుతం టెక్నాలజీ పెరిగిపోవడంతో ఆర్టిఫిషయల్ ఇంటలిజెన్స్(ఏఐ) రావడంతో అదేస్థాయిలో చదువును విద్యార్థులకు అందించాలన్న ఉద్దేశంతో ఉపాధ్యాయులకు శిక్షణ కల్పించారు. ఇప్పటికే కొన్ని పాఠశాలల్లో ఏఐ ద్వారానే చదువు నేర్పేలా ఏర్పాట్లు చేశారు. ఉపాధ్యాయులు నిత్యం విద్యార్థులకు చదువు ఎలా చెబుతున్నారన్న దానిపై పరిశీలించేలా చర్యలు తీసుకుంటున్నారు. పలు పాఠశాలల్లో కొందరు ఉపాధ్యాయులు వివిధ కారణాలతో స్కూల్‌కు దుమ్మా కొడుతుంటారు. ప్రస్తుతం అలా ఉండకూడదన్న ఉద్దేశంతో ఫేస్ రికగ్నైజ్ సిస్టమ్ ఏర్పాటు చేస్తున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. ప్రతి ఉపాధ్యాయుడు స్కూల్‌కు వెళ్లిన అనంతరం మొబైల్ ద్వారా ఫేస్ రికగ్నైజ్ చేయాల్సి ఉంటుంది. ఈ పద్ధతి ఏర్పాటు చేస్తే ఉపాధ్యాయుల గైర్హాజరు తక్కువగా ఉండే అవకాశముంది. ఇప్పటికే ప్రభుత్వం ముందుగానే విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేయడంతోపాటు యూనిఫాంలు సైతం అందజేసింది.

ఏరువాక పౌర్ణమి

ధర్మపురి: తీగళధర్మారం గ్రామంలోని శ్రీకృష్ణ గీతాశ్రమంలో బుధవారం ఏరువాక పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వర్షాలు కురవాలని కోరుతూ గాయత్రి, వరుణ యజ్ఞం తదితర పూజలు నిర్వహించారు. రాజిరెడ్డి, జంగిలి ప్రభాకర్ తదితరులున్నారు.